క్లుప్తంగా

రేపటి నుంచి మండల స్థాయి కబడ్డీ పోటీలు

రఘునాథపల్లి: మండలంలోని మండలగూడెంలో ఉగాదిని పురస్కరించుకొని ఈ నెల 9వ తేదీన మండలస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మారపాక రాజశేఖర్, డ్యాగల రాజశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ సహకారంతో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. క్రీడా జట్లకు ఎలాంటి ఎంట్రీ ఫీజు లేదని, మొదటి నాలుగు స్థానాల్లో ప్రతిభ చాటిన జట్లకు మెమోంటో, నగదు ప్రోత్సాహం అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని కబడ్డీ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాల కోసం 95054 74397, 91548 48364 నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

‘కడియం’ను కలిసిన నాయకులు



స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని శివునిపల్లికి చెందిన మాజీ సర్పంచ్ కొంతం శ్రీనివాస్‌తో పాటు పలువురు నాయకులు ఆదివారం హనుమకొండలో ఎమ్మెల్యే కడియం శ్రీహరిని, కాంగ్రెస్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ కావ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల కడియం కాంగ్రెస్‌లోకి రావడంపై హర్షం వ్యక్తం చేస్తూ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట బంగ్లా శ్రీను, గుర్రం ఫాతికుమార్ ఉన్నారు.

రాములోరి కల్యాణానికి ముస్తాబవుతున్న ఆలయం



చిల్పూరు: నష్కల్ గ్రామంలోని సీతారామ చంద్ర స్వామి ఆలయం ఈనెల 17వ తేదీ (బుధవారం) నిర్వహించే రాములోరి కల్యాణానికి ముస్తాబవుతోంది. ఆలయ చైర్మన్ కోరుకొప్పుల హరికిషన్, ఎంపీటీసీ పాశం శిరీషసురేష్, దాతలు, ప్రజల సహాయ సహకారాలతో కల్యాణానికి వచ్చే భక్తులకు అన్ని విధాలా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

పరామర్శ



పాలకుర్తి: మండలంలోని గూడూరు గ్రామానికి చెందిన తీన్మార్ మల్లన్న టీం కో కన్వీనర్ బ్రహ్మాచారి తండ్రి లక్ష్మయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబీకులను తీన్మార్ మల్లన్న ఆదివారం పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. మాదం రజని కుమారి, గాడిపెల్లి యాకన్న ఉన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి



పాలకుర్తి: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో మృతి చెందిన పాలకుర్తి మండలం తీగారం గ్రామానికి చెందిన బైకాని శ్రీశైలం కుటుంబాన్ని ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాపర్తి రాజు కోరారు. ఆదివారం శ్రీశైలం మృతదేహంపై ఎర్ర జెండాను కప్పి నివాళుల ర్పించారు. మృతుడి భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని డిమాండ్ చేశారు. డీఈ, ఏఈల నిర్లక్ష్యంతో మృతి చెందిన బాధిత కుటుంబానికి రూ.30 లక్షల సాయం అందజేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా నాయకుడు చిట్యాల సోమన్న, కార్మికులు బాదావత్ లక్ష్మణ్, అబ్బోజు పూర్ణాచారి, కోట అనిల్ కుమార్, మందుల శంకర్, తోట్టి సతీష్, భూక్య భాస్కర్, ఎనగందుల ప్రవీణ్, సోమన్న, పరశు రాములు, అనిల్, ఆనంద్ ఉన్నారు.

మాదిగ హక్కుల దండోరా అధికార ప్రతినిధిగా ప్రసాద్



కేయూ క్యాంపస్: మాదిగ హక్కుల దండోరా ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు కేతపాక ప్రసాద్‌ను మాదిగ హక్కుల దండోరా ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గనిపాక ప్రదీప్ నియమించారు. ఈ మేరకు కేతపాక ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

జోరుగా ‘మినరల్ వాటర్’ దందా

- నీటిని శుద్ధి చేయకుండానే అమ్మకాలు
- నిబంధనల్ని విస్మరిస్తున్న వాటర్‌ప్లాంట్ల యజమానులు
- చోద్యం చూస్తున్న అధికారులు



ప్యూరిఫై వాటర్ సరఫరా చేస్తున్న ఓ వాటర్‌ప్లాంట్ ఆటో



శివునిపల్లిలో మూతపడిన జీపీ వాటర్‌ప్లాంట్

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్‌తో పాటు వివిధ మండలాల్లోని గ్రామాల్లో మినరల్ వాటర్ దందా మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది. ప్రస్తుతం వేసవికాలం కావడంతో వాటర్‌ప్లాంట్ల యజమానులు కుమ్మక్కై అందిన కాడికి దండుకుంటున్నారు. వాటర్‌ప్లాంట్ల నిర్వాహకులు కనీస నాణ్యత ప్రమాణాలు పాటించకుండా మినరల్ వాటర్ అంటూ ప్యూరిఫైడ్ వాటర్‌ను అందిస్తూ ప్రజల్ని మోసం చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు ఈ విషయాన్ని పట్టించుకోకుండా చోద్యం చూస్తుండగా ఇదే అదనుగా ప్లాంట్ల యజమానులు ఆడిందే ఆటగా వ్యాపారం చేస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామాల్లో మిషన్‌భగీరథ నీరు వస్తే రక్షిత తాగునీటి బాధ తీరుతుందని ప్రజలు ఎదురుచూడగా మిషన్ భగీరథ నీరు తాగేందుకు అనువుగా లేవు. దాంతో ప్రజలు తాగునీటికి మినరల్‌వాటర్‌పైనే ఆధారపడుతున్నారు. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో జిల్లా వ్యాప్తంగా పుట్టగొడుగుల్లా వాటర్ ప్లాంట్లు వెలుస్తున్నాయి. ఇప్పటికే జిల్లాలో దాదాపు 300కి పైగా వాటర్‌ప్లాంట్లు ఉన్నాయంటే మినరల్ వాటర్ దందా ఏ స్థాయిలో సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. చాలా మంది వాటర్ ప్లాంట్ల యజమానులు ఐఎస్‌ఐ ప్రమాణాలు పాటించడం లేదు.

నీటిని నామమాత్రంగా శుద్ధి చేస్తున్న ప్లాంట్ల యజమానులు

పలు వాటర్‌ప్లాంట్లలో నీటిని కనీసం శుద్ధి చేయకుండానే అమ్మకాలు చేస్తున్నారు. ప్లాంట్ల నిర్వహణపై కనీస అవగాహన లేకుండానే నీటిని తూతూమంత్రంగా శుద్ధి చేస్తూ సరఫరా చేస్తుండగా ప్రజల ఆరోగ్యానికి రక్షణ లేకుండా పోయింది. వాటర్‌ప్లాంట్లలో సరైన పద్ధతిలో నీటిని శుద్ధి చేయకుండానే అమ్మకాలు చేస్తున్నారు. సంబంధిత రసాయనాలను ఇష్టారాజ్యంగా కలుపుతున్నారు. సరైన మోతాదులో కలుపకపోవంతో ఈ నీటిని తాగిన వారు మోకాళ్లు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. చాలాచోట్ల జనరల్‌వాటర్‌నే నామమాత్రంగా శుద్ధి చేసి ప్యూరిఫైడ్ వాటర్‌గా అమ్ముతున్నారు. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని ప్యూరిఫైడ్ వాటర్‌నే మినరల్ వాటర్ అంటూ 20 లీటర్లక్యాన్‌ను రూ.15 నుంచి రూ.20వరకు విక్రయిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులకు ఏమాత్రం పట్టడం లేదు.

మూతపడిన శివునిపల్లి జీపీ వాటర్‌ప్లాంట్

డివిజన్ కేంద్రానికి జంటపట్టణంగా ఉన్న శివునిపల్లిలో గతంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్ దాదాపు 7సంవత్సరాలుగా మూతపడగా పంచాయతీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. శివునిపల్లిలో గతంలో ఈ వాటర్‌ప్లాంట్ ద్వారా ఇంటింటికి నీటిని సరఫరా చేసేది. క్యాన్ వాటర్‌కు రూ.3 నుంచి రూ.5వరకు విక్రయించారు. అయితే ఆరేళ్ల క్రితం మూతపడగా గ్రామస్తులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వాటర్‌ప్లాంట్ల వద్ద అధిక ధరలకు నీటిని కొనుగోలు చేస్తూ ఇబ్బందులకు గురవుతున్నారు. ఇలాంటి పరిస్థితులు జిల్లాలోని పలు గ్రామాల్లో నెలకొన్నాయి.

తనిఖీల జాడే లేదు

కనీస నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నిర్వహిస్తున్న వాటర్‌ప్లాంట్లపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ ఏమాత్రం లేదు. వాటర్‌ప్లాంట్ల యజమానులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కనీసం సంబంధిత అధికారులు ఇంతవరకూ తనిఖీలు చేసిన ఊసేలేదు. ప్లాంట్ల యజమానులు అధికారులకు మామూళ్లు ఇస్తున్నారని, అందుకే పట్టించుకోవడం లేదని పలువురు బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ వాటర్‌ప్లాంట్లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామ పంచాయతీలు వాటర్‌ప్లాంట్లను నిర్వహించాలి



గ్రామాల్లో జీపీల ఆధ్వర్యంలో వాటర్‌ప్లాంట్ల నిర్వహణ చేపట్టాలి. ఘన్‌పూర్‌కు జంటపట్టణంగా ఉన్న శివునిపల్లిలో గతంలో జీపీ ఆధ్వర్యంలో నడిపించిన వాటర్‌ప్లాంట్‌ను తిరిగి ప్రారంభించాలి. జీపీ అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో ప్రజలు నీటికోసం ఇబ్బందులకు గురవుతున్నారు.

\- శనబోయిన నాగేష్, శివునిపల్లి

అధికారులు తనిఖీలు చేయాలి



వాటర్‌ప్లాంట్లను ఎప్పటికప్పుడు అధికారులు తనిఖీలు చేయాలి. అధికారులు పట్టించుకోకపోవడంతో ప్లాంట్ల యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కనీస నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నీటిని నామమాత్రంగా శుద్ధి చేస్తూ విక్రయాలు చేస్తున్నారు. ప్లాంట్లలో నీటిని తూతూమంత్రంగా ప్యూరిఫై చేసి మినరల్ వాటర్ అంటూ ప్రజలకు అమ్ముతున్నారు.

\-మునిగెల రమేష్, ఇప్పగూడెం

ఆర్థికసాయం



బచ్చన్నపేట: మండలంలోని కొన్నె గ్రామంలో మృతి చెందిన కుచన సిద్దమ్మ కుటుంబ సభ్యులకు గ్రామ వాసి, సామాజిక కార్యకర్త కోడూరి శివకుమార్‌గౌడ్ ఆర్థికసాయం అందజేశారు. ఆదివారం మృతురాలు కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి రూ. 5వేలను అందించారు. కుందారపు యాదగిరి, ఎనుగుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్కరాజుపల్లిలో..



తరిగొప్పుల: మండలంలోని అక్కరాజుపల్లి గ్రామానికి చెందిన మంచినీళ్ల యాదగిరి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా, గ్రామానికి చెందిన యూనిక్యూ యూత్ అసోసియేషన్ సభ్యులు బాధిత కుటుంబసభ్యులను ఆదివారం పరామర్శించి రూ.3,000 సాయం అందజేశారు. కరుణాకర్, గిరి, రవితేజ, బన్నీ, రాజు,పండు ఉన్నారు.

‘సీపీఎంతోనే భువనగిరి అభివృద్ధి’



మాట్లాడుతున్న ఎండీ అబ్బాస్

జనగామ రూరల్: భువనగిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల అభివృద్ధి సీపీఎంతో మాత్రమే సాధ్యమవుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్ అన్నారు. ఆదివారం మండలంలోని పసరమడ్ల గ్రామంలో ప్రభాకర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకులతోనే భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని విమర్శించారు. గత పదేళ్లలో వామపక్ష అభ్యర్థులు పార్లమెంట్‌లో లేని కారణంగా కార్పొరేట్ శక్తులు వారికి అనుకూల బిల్లులు ప్రవేశపెట్టి పార్లమెంట్‌లో ఆమోదింపజేసుకున్నాయని అన్నారు. భువనగిరి పరిధిలో సాయుధ పోరాటం నుంచి ఎంతో మంది ప్రజల కోసం ప్రాణత్యాగాలు చేశారన్నారు. ప్రశ్నించే గొంతుకను గెలిపించి పార్లమెంట్‌కు తీసుకెల్లాలని కోరారు. జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, యాదగిరి, విజేందర్, రాజు, కురుణాకర్, శ్రీను, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన దుర్గామాత ఉత్సవాలు

రఘునాథపల్లి: మండలంలోని రామన్నగూడెంలో రెండు రోజుల పాటు నిర్వహించిన దుర్గామాత ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. శనివారం అర్ధరాత్రి దాటాక దుర్గామాతకు గ్రామస్తులు ఊరుమ్మడిగా డప్పుచప్పుళ్ల మధ్య బోనాలతో ఊరేగింపుగా దుర్గామాత ఆలయానికి చేరుకొని బోనాలు సమర్పించారు. తెల్లవారే దాక ఆలయం వద్ద డుబ్బులోళ్లు చెప్పిన కథలకు భక్తులు ముగ్ధులయ్యారు. ఆదివారం ఉదయాన్నే డుబ్బులోళ్లు ఆలయం వద్ద గావు పట్టడంతో గ్రామస్తులు కోళ్లు, యాటలు బలిచ్చారు. మధ్యాహ్నం దుర్గామాతకు మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఒడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకుని సల్లంగా చూడాలని దేవతను వేడుకున్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బాల్‌నర్సయ్య తదితరులు

బచ్చన్నపేట: రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని మాల మహానాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్యాల బాల్‌నర్సయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు అవుతున్నా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. రాజ్యాంగాన్ని మార్చే కుట్రలు కొందరు చేస్తున్నారని, రాజ్యాంగం రక్షించుకోవడానికి అందరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ రక్షణ కొనసాగుతుందని, నేడు (సోమవారం) హైదరాబాద్‌లోని మేడ్చల్‌లో నిర్వహించే ముగింపు సభకు పార్టీలకతీతంగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. నాయకులు తమ్మడి మహేందర్, చిలుముల విజయ భాస్కర్, మల్యాల రమేష్, సనాది క్రాంతి కుమార్, నర్సింగ శివకుమార్, బల్లెపు యాదగిరి, అబ్బయ్య, బాల్‌నర్సయ్య, రమేష్, సంపత్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి కమిటీ ఎన్నిక



ఎన్నికైన అభివృద్ధి కమిటీ సభ్యులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఛాగల్లు గ్రామంలో దేవాలయాల అభివృద్ధి కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా బూర్ల రమేష్, గౌరవ అధ్యక్షుడిగా పోగుల సారంగపాణి, ఉపాధ్యక్షులుగా సొదరపల్లి సంపత్‌రాజు, అన్నెపు అనీల్, చేపూరి ప్రభాకర్, పొన్న రాజేష్, ప్రధాన కార్యదర్శులు మాదారపు సందీప్, రంగు అనూప్‌కుమార్, భాసుకల సుధాకర్, కోశాధికారిగా కూన రాజు, సహాయక కోశాధికారిగా బూర్ల అనీల్, సహాయ కార్యదర్శులుగా అనీల్, కార్తీక్, సాంబరాజు, మురళీ, శ్రీకాంత్, రామంచ రాజు, ప్రచారకార్యదర్శులుగా రాజశేఖర్, హరీష్, సందీప్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు రమేష్, గౌరవ అధ్యక్షుడు సారంగపాణి మాట్లాడుతూ గ్రామంలోని అన్ని దేవాలయాల పునరుద్ధరణ, అభివృద్ధి కోసం కమిటీ ఏర్పాటు చేశామన్నారు. తెలుగు నూతన సంవత్సరంలో గ్రామంలోని దేవాలయాలను దాతలు, ప్రజాప్రతినిధుల సహకారంతో అభివృద్ధి చేస్తామన్నారు. కమిటీ సలహాసంఘం సభ్యులు సత్తు రవి, యాట వెంకటయ్య, యాదగిరి, మల్లికార్జున్, ధర్మయ్య, కార్యవర్గ సభ్యులు సాంబరాజు, సంతోష్, రాజు, ప్రవీణ్, అనీల్, ఎదునూరి రాజేష్ పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న వర్ధన్నపేట సీఐ సూర్యప్రకాశ్

జఫర్‌గఢ్: గంజాయి, గుట్కా, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలకు యువత దూరంగా ఉండాలని వర్ధన్నపేట సీఐ సూర్యప్రకాశ్ అన్నారు. మండలంలోని తమ్మడపల్లి (జి) గ్రామంలో వరంగల్ నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పోలీస్ కళా జాగృతి బృందం శనివారం రాత్రి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కళాకారులు చదువు, రోడ్డు ప్రమాదాలు, గుట్కా, గంజాయి, బాల్య వివాహాల నిర్మూలన, 100 డయల్, మూఢనమ్మకాలు తదితర అంశాలపై ఆట పాటలతో ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వర్ధన్నపేట సీఐ హాజరై మాట్లాడారు. యువత చెడు మార్గాల్లో పయనించి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. నేరాలను నియంతించడంలో సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతాయని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై రవియాదవ్‌తో పాటు పోలీస్ కళాకారులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఆదాయం పెంచేలా ప్లాన్ చేయండి

కాంగ్రెస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ రాంచందర్

జనగామ: గత బడ్జెట్ సమావేశంలో మున్సిపల్ ఆదాయం పెరిగేలా సభ్యులు సూచించిన మేర ఎటువంటి చర్యలు తీసుకున్నారో వచ్చే కౌన్సిల్ సమావేశంలో సభ్యులకు వివరించాలని కాంగ్రెస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గాదెపాక రాంచందర్ అన్నారు. ఈ మేరకు ఆయన మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లకు లిఖిత పూర్వకంగా వినతి చేసినట్లు చెప్పారు. అనంతరం రాంచందర్ మాట్లాడుతూ ప్రస్తుత మున్సిపల్ ఆదాయంలో ఏటా అదనంగా రూ.40లక్షలు పెంచుకునే అవకాశం ఉందన్నారు. ఇందుకు సంబంధించి ఆధారాలతో సహా కౌన్సిల్‌కు వివరించామన్నారు. పట్టణంలోని 4వేల దుకాణాలపై గత రెండేళ్ల కాలపరిమితితో రూ.40లక్షల మేర ఫీజులను వసూళు చేసే అవకాశం ఉందన్నారు. నూతనంగా నిర్మించిన సుమారు 5 వందల నివాస గృహాలకు అసెస్‌మెంట్ చేస్తే రూ.10 లక్షలు, స్వర్ణ కళామందిర్ ఏరియాలోని కూరగాయల మార్కెట్ స్టాళ్లపై ఏడాదికి రూ.1,500 చొప్పున వసూళు చేస్తే రూ.2లక్షలు, డివైడర్స్‌పై హోర్డింగ్‌లు, వాల్ పేయింట్, సినిమా పోస్టర్లపై ట్యాక్స్‌ల రూపంలో ఏడాదికి రూ.10 లక్షలకు వరకు రాబడి వస్తుందన్నారు. అలాగే, ఖాళీగా ఉన్న పురపాలిక షెట్టర్లను వేలం ద్వారా అద్దెకు ఇవ్వడంతో ఆదాయ మార్గాలు పెంచయకోవచ్చని సూచించారు. ఈ మాసంలో తైబజార్, రోడ్డుపై విక్రయం చేసే వారి నుంచి ట్యాక్స్ వసూళు చేసే విధి విధానాలను అమలు చేస్తే భారీగా ఆదాయం పెంచుకోవచ్చునని తెలియజేశారు.

పద్మశ్రీ గడ్డం సమ్మయ్యకు సన్మానం



సమ్మయ్యను సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

దేవరుప్పుల: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన చిందు యక్షగానకళాకారుడు గడ్డం సమ్మయ్యను పీఆర్‌టీయూ టీఎస్ శాఖ జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించింది. ఆదివారం మండలంలోని అప్పిరెడ్డిపల్లెలోని సమ్మయ్య స్వగృహంలో పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర శాఖ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు శ్రీపాల్‌రెడ్డి, కమలాకర్‌రావు ఆయనను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారిద్దరు మాట్లాడుతూ సంప్రదాయ కళలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం పురస్కారానికి ఎంపిక చేయడం అభినందనీయమన్నారు. పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహిపాల్ రెడ్డి, ఎల్లారెడ్డి, మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు అంబటి అంజయ్య, భీకోజి, మండల బాధ్యులు కిరణ్ కుమార్, భీమా, బాలనర్సయ్య, మెతుకు రాజు, గోపికిషన్, మల్లేశం, పవన్ పాల్గొన్నారు.

‘రాజకీయ లబ్ధి కోసమే బీఆర్‌ఎస్ దీక్షలు’



మాట్లాడుతున్న సత్యనారాయణ

పాలకుర్తి టౌన్: రాజకీయ లబ్ధి కోసమే బీఆర్‌ఎస్ నేతలు రైతుల పేరిట దీక్షలు చేస్తున్నారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ అన్నారు. ఆదివారం పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావుతో కలిసి మాట్లాడారు. వరద కాల్వల నిర్మాణ పనులు ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి సొంత డబ్బులు వెచ్చించి చేయిస్తున్నారని తెలిపారు. పదేళ్ల పట్టించుకోని బీఆర్‌ఎస్ నాయకులు నేడు నీటి సమస్యపై ప్రచారం చేయడం సరికాదన్నారు. సాగు నీటిపై మాట్లాడే అర్హత మాజీ మంత్రి దయాకర్ రావుకు లేదని అన్నారు. బీఆర్‌ఎస్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాలను గమనించిన ప్రజలు, నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి బైరు భార్గవ్, మండల యూత్ అధ్యక్షులు మాదాసు హరిష్, ఎస్టీసెల్ అధ్యక్షులు భాస్కర్, మాజీ ఎంపిపి గడ్డం యాకసోమయ్య, రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి గుగ్గిళ్ల ఆదినారాయణ, మాజీ సర్పంచ్ ఆంజనేయులు, యాకయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మూలవిరాట్‌కు మొక్కులు



మూలవిరాట్‌కు మొక్కులు చెల్లించుకుంటున్న లక్ష్మీనారాయణ దంపతులు

దేవరుప్పుల: మండలంలోని కడవెండి శివారులోని వాన కొండయ్యగుట్టపై కొలువుదీరిన లక్ష్మీనృసింహ స్వామి జాతరను పురస్కరించుకుని ఆదివారం టీపీసీసీ సభ్యుడు డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణ నాయక్, ఉమ్మడి వరంగల్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ ధన్వంతి దంపతులు మూల విరాట్‌ను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పూజారులు బీటుకూరి రంగాచార్యులు, సంపత్ కుమార చార్యులు మంత్రోచ్ఛారణ నడుమ వారు ప్రత్యేక పూజలు, స్వామి వారికి అభిషేకం చేసిన అనంతరం, ఆశీర్వచనాలు తీసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ గిరిజనులకు అత్యంత ఆరాధ్యుడైన వాన కొండ లక్ష్మీనృసింహస్వామి కటాక్షంతో ఈ ప్రాంతం, గిరిజన ఆవాస ప్రాంతాలు ప్రకృతి సిద్ధమైన వాతావరణం పచ్చగా ఉండాలని భగవంతుడిని కోరుకున్నట్లు తెలిపారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



చిల్పూరు: సమ్మేళనంలో ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు



జనగామ: సమ్మేళనంలో పాల్గొన్న 2003-04 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

చిల్పూరు: మండలంలోని మల్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1994-95లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. అలనాడు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు ఇంద్రసేనారెడ్డి, లింగారెడ్డి, ఆశిరెడ్డిలను పూర్వ విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో కుమార్, కింగర్ల రమేష్, బుర్క శ్రీనివాస్, డాక్టర్ రాజు, పుజ్జం చందర్‌రడ్డి, బుచ్చిరాజు, కరుణ, రజిత, జ్యోతి, నీలిమ పాల్గొన్నారు.

రెండు దశాబ్దాల కలయిక

జనగామ: ఒకటో తరగతి నుంచి పది వరకు కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు రెండు దశాబ్దాల తర్వాత ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకుని ఆనాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. ఆదివారం పట్టణంలో 2003-04 బ్యాచ్‌కు చెందిన ఆదర్శ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. పాఠశాల విద్యాభ్యాసం తర్వాత పైచదువుల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లిన స్నేహి తులు.. 21 ఏళ్ల సుదీర్ఘ కాలం తర్వాత మళ్లీ కలుసుకున్నారు. కుటుంబ బాధ్యతలు.. మరో వైపు జీవన ప్రయాణంలో ఒడిదొడుకులు.. మంచి, చెడును ఒకరినొకరు పంచుకున్నారు. నాటి పాఠశాల కరస్పాండెంట్ ఎర్రం రెడ్డి మురహర్ రెడ్డి, ప్రిన్సిపాల్ వీరయ్య, డైరెక్టర్లు సోమయ్య, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పృథ్వీరాజ్, స్వామి, ప్రభాకర్, హరిప్రసాద్, జయలక్ష్మి చక్రవర్తి, హరీష్, సంధ్య మాట్లాడుతూ తాము విద్యాబుద్ధులు నేర్పిన పూర్వ విద్యార్థులు ఇంతటి ఉన్నత స్థాయిలో ఉండడం ఎంతో గర్వంగా ఉందన్నారు. రెండు దశాబ్దాలు గడిచిన తర్వాత కూడా తమను గుర్తు పెట్టుకొని సన్మానించడం ఎప్పటికీ మరచి పోలేమన్నారు.

ఆలయ ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ



చిల్పూరు: శ్రీపతిపల్లి గ్రామ సమీపంలో ఇటీవల నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి గ్రామానికి చెందిన ఫార్మర్ ప్రొడక్షన్ ఆర్గనైజేషన్ ఫౌండర్, దాత మాలోత్ రాజు-స్రవంతి దంపతులు ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ రూ. 5లక్షల సొంత ఖర్చులతో ప్రహరీ నిర్మిస్తున్నట్లు చెప్పారు. దాతలు మాలోత్ జ్ఞానేశ్వర్, పూజిత, రంగు రమేష్, పాలబోయిన నరేష్, ఉడుత వెంకటనారాయణ, మేస్త్రీ పిట్టల బాలకృష్ణ, గొంగిడి కృష్ణమూర్తి, గడ్డం సిద్దయ్య పాల్గొన్నారు.